క్లుప్తంగా

10న కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నిక

కడియం: కడియపులంక పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికను ఆగస్టు 10వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలం కడియపులంక పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు, ప్రకాశం జిల్లా ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లోని కొండెపి గ్రామ పంచాయతీ సర్పంచ్, అన్ని వార్డు సభ్యుల ఎన్నికలను ఈ నోటిఫికేషన్ ద్వారా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆగస్టు ఒకటో తేదీలోపు నామినేషన్లు దాఖలు చేయాలి. 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి స్క్రూటినీ ఉంటుంది. అనంతరం తుది జాబితాను 4వ తేదీన ప్రకటిస్తారు. 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం కల్పిస్తారు. అనంతరం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. 10వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుంది. 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి, ఫలితాలను వెల్లడిస్తారు. కాగా.. కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణీ మృతితో ఆ పదవి ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఉప సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు.

అసెంబ్లీ సమయానికే హాజరు కావాలి

కంబాలచెరువు: అసెంబ్లీ సమయానికే విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. మోరంపూడిలోని సిటీ స్పెషల్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. అసెంబ్లీ నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమిక్ క్యాలెండర్‌లో అసెంబ్లీ నిర్వహణ అంశాలను వివరించారని, ఆ ప్రకారం అన్ని పాఠశాలల్లో అసెంబ్లీ నిర్వహించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌కు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. కోర్లమ్మపేటలోని కుసుమ నాగన్న నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి సూచనలు చేశారు. సంసిద్ధతా కార్యక్రమాల అమలు తీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల కరదీపికలో ఇచ్చిన డైరీని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవరావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగిది. ఉపాధ్యక్షుడి బోడపాటి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు కూడా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, యార్డు ఇన్‌చార్జ్ కె.హరిబాబు, పర్యవేక్షకులు రాజీవ్ చీలి, కూటమి నేతలు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా నిర్దేశించిన గడువులోపు సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు వివిధ సమస్యలపై 19 అర్జీలు అందజేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ అర్జీదారుల సంతృప్తి కొలమానంగా పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు సూచించారు. అనంతరం గత పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై శాఖల వారీగా అధికారులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ(ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఓ వినూత్న, అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ముస్లిం పెద్దలు

కంబాలచెరువు: నగరానికి చెందిన ముస్లిం మైనార్టీ పెద్దలు సోమవారం జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీని కలిసి పలు విషయాలపై చర్చించారు. ఎస్పీని కలిసిన వారిలో అడ్వకేట్ అసదుల్లా అహ్మద్, జేజేహెచ్ ప్రెసిడెంట్ ఎస్కే అహ్మద్ అన్సారీ, మాజీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్కే ఆరీఫ్, ఏఐఎంసీ జనరల్ సెక్రటరీ ఎండీ షఫీక్ తదితరులు ఉన్నారు.

జోరుగా మొక్కల ఎగుమతులు

- అనుకూలంగా వాతావరణం
- ఊపందుకున్న మొక్కల రవాణా
- నర్సరీల్లో సందడి
- కూలీలకు చేతినిండా పని



లారీలోకి మొక్కలను లోడ్ చేస్తున్న కూలీలు

కడియం: చిరు జల్లులు మినహా మండల పరిధిలో పెద్దగా వర్షాలు లేకపోవడంతో మొక్కల ఎగుమతులకు అవకాశం చిక్కింది. దీంతో మొక్కల ఎగుమతులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. కడియంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో నర్సరీ రంగం విస్తరించింది. దాదాపు వెయ్యికి పైగా అలంకరణ, పుష్ప, ఫల మొక్కలు ఇక్కడ లభిస్తున్నాయి. విస్తృత సంఖ్యలో మొక్కలు ఉత్పత్తి కావడం, రూ.5 నుంచి లక్షల రూపాయలు విలువ చేసే మొక్కలు సైతం ఈ ప్రాంతంలో లభించడంతో మన రాష్ట్రంతో పాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా మొక్కల కొనుగోలుదారులు ఇక్కడికి వస్తారు.

డిసెంబర్ వరకూ..

సాధారణంగా జూన్ 15 నుంచి మొక్కల ఎగుమతుల సీజన్ ప్రారంభమై డిసెంబర్ వరకు కొనసాగుతుంది. అయితే ఆరంభంలో వర్షాల రావడంతో ఎగుమతులకు ఆటంకాలు కలిగాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడడం, కడియం ప్రాంతంలో తక్కువగానే ఉండడంతో ఎగుమతులు జోరందుకున్నాయని ఇక్కడి రైతులు చెబుతున్నారు. కడియం ప్రాంతం నుంచి చిన్న, పెద్ద వాహనాలతో కలిపి రోజుకు 200 నుంచి 300ల వరకు వాహనాల్లో మొక్కలను లోడు చేస్తున్నట్లు అంచనా.

కూలీలకు డిమాండ్

మొక్కల ఎగుమతులు జోరందుకోవడంతో ఎగుమతి చేసే కూలీలకు డిమాండ్ ఏర్పడింది. టన్ను మొక్కలను ఎగుమతి చేసినందుకు కూలీలకు రూ.450 చెల్లిస్తారు. ఒక్కో వాహనానికి టన్నేజీ, మొక్కల సంఖ్యను బట్టి కూలీలు ఉంటారు. ఈ లెక్కన ప్రతి రోజూ 2 వేల నుంచి 3 వేల మంది వరకూ కూలీలకు ఇక్కడ డిమాండ్ ఉంది. దీంతో కడియం మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి కూడా కూలీలు ఇక్కడికి వచ్చి మొక్కల ఎగుమతుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి కూలీలకు అదనంగా చెల్లించేందుకు కూడా వెనుకాడరు. దీంతో ఎగుమతుల సీజన్‌లో తమకు బాగానే గిట్టుబాటు అవుతుందని కూలీలు చెబుతున్నారు. మండలంలోని కడియపులంక కేంద్రంగా ఉదయాన్నే కూలీలను ఏర్పాటు చేసుకుని, మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న నర్సరీల వద్ద మొక్కలు ఎగుమతి చేసుకునేందుకు బయలుదేరతారు. ఈ సీజన్‌లో ఒక్క కూలీలే కాకుండా భోజనం హోటళ్లు, కూల్‌డ్రింక్‌లు, జ్యూస్ షాపులకు కూడా గిరాకీ బాగుంటుంది. వీరే కాకుండా లోడింగ్‌కు వినియోగించే గమేళాలు, కావిళ్లు, ట్రాలీలు, కర్రలు/తాళ్లు అద్దెకు ఇచ్చేవాళ్లకు సైతం ఎగుమతుల సీజన్‌లోనే గిరాకీలు ఎక్కువగా ఉంటాయి.

సీజన్‌లోనే వస్తాం

మొక్కల ఎగుమతులు సీజన్ మొదలైనప్పుడు ఇక్కడికి వస్తాం. 25 మంది జట్టులో నేనూ ఒకడిని. ప్రతి రోజూ రెండు 30 టన్నుల బళ్లు లోడు చేసేందుకు వెళుతుంటాం. ఈ సీజన్‌లో కూలీ ఎక్కువగా వస్తుంది. జట్టు సభ్యులంతా ఉమ్మడిగా పనిచేసి, వచ్చిన మొత్తాన్ని పంచుకుంటాం.

– కె.వీరబాబు, మాధవరాయుడుపాలెం

పని దొరుకుతోంది

వర్షం పెద్దగా ఇబ్బంది పెట్టడం లేదు. దీంతో దాదాపు నెల రోజులుగా ప్రతి రోజూ పని దొరుకుతోంది. కూలీ కూడా ఎక్కువ గానే వస్తుంది. మార్కెట్‌లోకి ఉదయాన్నే వస్తే ఏదో ఒక వాహనంపై మొక్కలు లోడు చేసేందుకు వెళ్లొచ్చు.

– పెద్ది నాయుడు, కడియపులంక

దాతల సహకారం అభినందనీయం



సీనియర్ బేసిక్ స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో రమారజని

కంబాలచెరువు: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని రాజమహేంద్రవరం అర్బన్ ఎంఈవో – 2 రమా రజని అన్నారు. అశోక థియేటర్ సమీపంలోని అన్నపూర్ణమ్మపేటలో ఉన్న నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అయిందని, అలాగే ఐడీబీఐ బ్యాంకు తమ సీఎస్ఆర్ నిధులు రూ.1.75 లక్షలతో పాఠశాలకు మౌలిక సదుపాయాలు సమకూరాయని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఏ.రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో అక్కడి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.

సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మంగాదేవి

రాజమహేంద్రవరం రూరల్: వేధింపు సమస్యలపై ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మంగాదేవి విద్యార్థినులకు సూచించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు మోరంపూడిలోని జాస్తి బుల్లెమ్మాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన సోమవారం మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మంగాదేవి మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం మహిళా చట్టాల ద్వారా కల్పించిన హక్కులు, స్వీయ రక్షణ గురించి వివరించారు. సోషల్ మీడియా వాడడంలో జాగ్రతలు తీసుకోవాలని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట, స్కైప్‌లో అపరిచుతులతో చాటింగ్ చేయవద్దన్నారు. ఏవైనా ఇబ్బందుల కలిగితే 112 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన యువత తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. జిల్లా సైబర్ సెల్ పోలీసులు మాట్లాడుతూ ఫేక్ లోన్ అప్ ఫ్రాడ్, టాస్క్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లలపై అప్రమతంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ ఎస్ఐ అమీనా బేగం, జిల్లా సైబర్ సెల్ సిబ్బంది వైఎస్‌వీ సురేష్, డి.మహేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై కూటమి నిర్లక్ష్యం



సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులు దారుణమైన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఆయన సోమవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు ఆహారం, వసతుల సౌకర్యం కల్పనపై కూటమి నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏడాదికి రూ.1400 కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.7,245 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ప్రస్తుతం కూటమిపాలనలో ప్రతీ రోజు మీడియాలలో సామాజిక మాధ్యమాలలో వసతిగృహాల విద్యార్థులు పడుతున్న పాట్లు చూస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ విద్యార్థులపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

కూటమి కక్ష సాధింపునకు పరాకాష్ట



ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ కూటమి ప్రభుత్వ కక్షసాధింపునకు పరాకాష్ట అని దివ్యాంగుల విభాగం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ విమర్శించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ సత్యమేవ జయతే అన్నట్టుగా మిథున్ రెడ్డి ఎటువంటి కేసులు లేకుండా బయటకు వస్తారన్నారు. 2029 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కనీసం దివ్యాంగులకు పెన్షన్ ఇచ్చే విషయంలో కూడా కూటమి ప్రభుత్వం తమ హామీ నిలబెట్టుకోకుండా విచారణ పేరుతో దివ్యాంగులను ఇబ్బంది పెడుతోందన్నారు. తల్లికి వందనం విషయంలో పూర్తిగా విఫలమైందని, దివ్యాంగులకు లేని మీటర్లు ఉన్నట్టుగా చిత్రీకరించి వారి పిల్లలకు తల్లికి వందనం ఎగ్గొట్టిందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన సదుపాయాలను మిథున్ రెడ్డికి కల్పించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేవలం రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ప్రభుత్వం వైదొలగటం ఖాయమని పోసికుమార్ స్పష్టం చేశారు.

అందరికీ అందుబాటులో న్యాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం జాగృతి, జస్టిస్ అవేర్నెస్ ఫర్ గ్రాస్ రూట్స్ ఇన్‌ఫర్మేషన్ అండ్ ట్రాన్స్‌ఫరెన్సీ ఇనిషియేటివ్ స్కీ 2025లో భాగంగా అందరికీ న్యాయం, అందుబాటులో న్యాయంపై పలు శాఖలతో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పంచాయతీ అనుసంధానంతో కలిసి పర్మినెంట్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పెట్టాలన్నారు. మారుమూల ప్రాంతాలకు, సంతలు నిర్వహించే ప్రదేశాల్లోనూ ఈ స్కీంలు అందజేయాలన్నారు. విస్తృత ప్రచారంలో భాగంగా రేడియోల్లో, టెలివిజన్లలో ప్రచారం చేయాలన్నారు. మారుమూల ప్రజలందరికీ తెలిసేలా జాగృతి పోస్టర్లు ఉండేలా, బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయసహాయం అందేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో జాగృతి స్కీం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాగృతి సభ్యులు ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, కలెక్టర్ కార్యాలయ అధికారులు, పానల్ లాయర్స్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెరిగిన అడ్మిషన్లు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగినట్టు ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ తీసుకున్న చర్యల కారణంగా కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య 134 నుంచి 150కు పైగా పెరగడం జరిగిందన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, కళాశాల సిబ్బంది నిరంతరం కృషి వల్ల 2024–25 సంవత్సరంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు



ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు సూచనలు ఇస్తున్న ఏడీసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: మనిషి ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషినల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. ఆయన సోమవారం కోటగుమ్మం, పుష్కర్ ఘాట్ పరిసర ప్రాంతాలలో చిరు వ్యాపారాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లు ఉండటాన్ని పరిశీలించారు. దీంతో ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత బ్యాగులను వాడాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశముందని, ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి, నీరు, గాలి కలుషితం అవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి ప్రత్యామ్నాయంగా గుడ్డ, జూట్ సంచులు వాడాలని సూచించారు. అనంతరం ఆ ప్రాంతంలో శానిటేషన్ పనులను పరిశీలించారు. పుష్కర్ ఘాట్ వద్ద ఫుట్‌పాత్‌ల మరమ్మతుల కారణంగా ఏర్పడిన డెబ్రిస్‌ను తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

క్వారీ గోతుల సమస్యకు మోక్షం లేదు



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న బర్రె కొండబాబు

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా క్వారీ గోతుల సమస్యకు పరిష్కారం లభించడం లేదని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా మైన్స్ అధికారులు పాటించడం లేదని మండిపడ్డారు. పైగా కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారన్నారు. క్వారీ గోతుల్లో పడి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అయినా సంబంధిత అధికారులకు రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి, గత కమిషనర్ కేతన్ గార్గ్ స్వయంగా సున్నంబట్టి లేఅవుట్ రోడ్డులో పర్యటించి ప్రమాదకరంగా ఉన్న క్వారీ గోతులను పరిశీలించి ఈ రోడ్డు వెంటనే కొత్తగా నిర్మించాలని, రాత్రిపూట లైటింగ్ ఏర్పాటు చేయాలని, గోతుల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. ఈ రోజుకూ అక్కడ మైన్స్ అధికారులు, ఇతర అధికారులు వాటిని అమలు చేయలేదని విమర్శించారు. సున్నంబట్టి లే అవుట్‌లో నివసించే గృహిణి కరేటి శ్రీదేవి మాట్లాడుతూ రాత్రిపూట ఈ రోడ్డులో బ్లేడ్ బ్యాచ్‌లు మాటువేసి మహిళలను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నుఆమన్నారు.

అక్రమాలతో వ్యక్తిగత సంపద సృష్టి

- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తీరు దారుణం
- నియోజకవర్గంలో జోరుగా పేకాట క్లబ్‌లు
- ఇటీవల జరిగిన టాస్క్‌ఫోర్స్ దాడే దానికి నిదర్శనం
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో 'వ్యసనాల ద్వారా సంపద సృష్టి' అనే శాఖను ఏర్పాటు చేసి, దానికి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మంత్రిగా నియమించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేకాట, గంజాయి, బెల్ట్ షాపులు, అక్రమ మట్టి విక్రయాల ద్వారా వ్యక్తిగత సంపదను పెంచుకుంటున్నారని, ఆ అక్రమాల బురదను మాత్రం జాతీయ పార్టీకి అంటిస్తున్నారని ఆరోపించారు. గత శనివారం రాత్రి ఎమ్మెల్యే స్వగ్రామం రామవరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేయడం, భారీ స్థాయిలో వాహనాలు, నగదును స్వాధీనం చేసుకుని 27 మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

పేకాట క్లబ్‌లు

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామవరంతో పాటు నియోజకవర్గంలో పలు గ్రామాలలో బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, అతడి కుమారుడి అనుచరులు పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై తాను అనేక సార్లు మాట్లాడానని, అయితే ఎక్కడా పేకాట క్లబ్‌లు లేవు అన్న రామకృష్ణారెడ్డి ఇప్పుడు ఏమీ సమాధానం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా జూదరులు వచ్చి, ఇక్కడ పేకాడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. మందు, విందు, తదితర సౌకర్యాలతో భారీగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన సంపద అభివృద్ధి కోసం వ్యసనాలను ప్రోత్సహించి, యువతను చెడు మార్గం పట్టించి, నియోజకవర్గంలో బెల్ట్ షాపులు, పేకాట శిబిరాలను అభివృద్ధి చేస్తున్నారని విమర్శించారు. వాటి ద్వారా వచ్చిన మామూళ్లు ఎమ్మెల్యే పట్టపురాణికి సంపద లక్ష్మి పథకంగా మారాయన్నారు.

ఆ విషయం తెల్చాలి

రామవరంలో పేకాట క్లబ్ నిర్వహించిన షెడ్డు.. ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోకులమా, లేక బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి వరసకు సోదరుడు, ముఖ్య అనుచరుడు నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి స్థావరమా అనేది అధికారులు తేల్చాలని సత్తి సూర్యానారాయణరెడ్డి డిమాండ్ చేశారు. పేకాట శిబిరం నిర్వహించిన షెడ్డు నిర్మించిన పొలం నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డికి చెందినదని, దానిలో నిర్మాణం చేయడానికి రామవరం పంచాయతీ నుంచి గోపాలకృష్ణారెడ్డి ప్లాన్ అప్రూవల్ పొందాడన్నారు. అయితే గోకులం నిర్మాణంలో భాగంగా వేరే వ్యక్తి పేరుపై ప్రభుత్వ నిధులు పొందడానికి ఈ షెడ్డు నిర్మాణం మొదలు పెట్టారని, ఎమ్మెల్యే అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట అన్నారు.

మూలారెడ్డి ప్రతిష్టను దిగజార్చుతున్నారు

స్వర్గీయ మూలారెడ్డి రాజకీయ వారసుడిని, 50 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పుకుంటున్నారని, అయితే తన అవినీతి, అక్రమాలతో మూలారెడ్డి ప్రతిష్టను కూడా దిగజారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. పేకాట, గంజాయి, బెల్ట్ షాపులు, లేఅవుట్ల మామూళ్లు, సెటిల్మెంట్ దందాలు, ప్రతిపక్ష కార్యకర్తలపై భౌతిక దాడులు వంటివి మూలారెడ్డి పాలనలో లేవన్నారు. ముందుగా మూలారెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, క్షమాపణ కోరి, ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సూచించారు.

'నన్నయ'లో క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తితో ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో సోమవారం మెన్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి బౌలింగ్ చేయగా, వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ బ్యాటింగ్ చేసి, పోటీలను ప్రారంభించారు. క్రికెట్‌తో పాటు కోకో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు కూడా జరుగుతాయన్నారు. పోటీల నిర్వాహకులు వి.సాల్మన్ దేవానంద్, డాక్టర్ వీవీఎంయూ ఫణీంద్ర, పీడీలు డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ కె.బాల సత్యనారాయణ, సీహెచ్. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం శ్లాబ్ పనుల పరిశీలన

పెదపూడి: వాటర్ ట్యాంక్ మరమ్మతులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కుమారప్రియం పంచాయతీలోని సురక్షిత తాగునీటి సరఫరా పథకం (వాటర్ ట్యాంక్) శ్లాబ్‌మరమ్మతులను సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.శివాజీ, సర్పంచ్ బీరద వీర వెంకట సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ట్యాంక్ శ్లాబ్ శిథిలమై, ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు ఎంపీడీఓ నరేంద్రరెడ్డి రూ.3 లక్షలు మంజూరు చేశారన్నారు. వాటితో ఈ పనులు చేపట్టారన్నారు. అలాగే ట్యాంక్ కింద భాగంలో ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నారన్నారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, గ్రామ పెద్దలు చోడిశెట్టి ఫణీంద్ర ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ డీవీ కృష్ణ

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయం లాభదాయమని, రైతులతో ఆ విధానంలో సాగు చేయించాలని అనపర్తి వ్యవసాయ సహయ సంచాలకులు డీవీ కృష్ణ అన్నారు. బలభద్రపురం గ్రామంలోని రైతుసేవ కేంద్రంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మొదటి ప్రకృతి వ్యవసాయ మోడళ్లు, 9 సహజ సూత్రాలు, ఏటీఎం పెరటి తోటలు, ఏ గ్రేడ్ మోడళ్లు, పలు పంటల సాగుపై మెళకువలు తెలిపారు. ఏడీ డీవీ కృష్ణ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈసారి రైతులు సంఖ్య, విస్తీర్ణం పెంచాలన్నారు. దీనివల్ల రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలోని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొర్రా తాతారావు, అడిషనల్ డీపీఎం వల్లీ పాల్గొన్నారు.